క్లుప్తంగా

నేడు తూర్పులో ఈటల ప్రచారం

వరంగల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఖమ్మం, మహబూబాబాద్, నర్సంపేట పర్యటనలను బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ముగించుకుని మంగళవారం రాత్రి వరంగల్ చేరుకుని పార్టీ నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఇంట్లో బస చేస్తారు. బుధవారం ఉదయం మీడియా సమావేశం అనంతరం వరంగల్ తూర్పులో నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని ప్రదీప్‌రావు తెలిపారు.

మరోసారి అవకాశం కల్పించడం అభినందనీయం

వరంగల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే పూర్తయినప్పటికీ మిగిలిపోయిన వారికోసం మరో అవకాశం కల్పించడం అభినందనీయమని పైడిపల్లికి చెందిన విద్యావంతుల వేదిక నాయకుడు బొల్లం విజయకుమార్ అన్నారు. వరంగల్ కాశిబుగ్గలోని మున్సిపల్ సర్కిల్ కార్యాలయంలో కులగణన ఫార్మాట్ నింపి ప్రజాపాలన సెంటర్‌లో ఎన్యూమరేటర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొన్ని కుటుంబాలు అనేక కారణాలతో సర్వేలో పాల్గొనలేక పోయాయని అన్నారు.

మాజీ ఎమ్మెల్యే నరేందర్‌పై కేసు నమోదు

వరంగల్: మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించడంతో పోచమ్మమైదాన్ జంక్షన్‌లో ట్రాఫిక్ జామ్ అయింది. ఈమేరకు అనుమతి లేకుండా వేడుకలు నిర్వహించి ట్రాఫిక్ జామ్‌కు కారణమైన వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ షుకుర్ తెలిపారు. రోడ్డుపై ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడిన క్రమంలో వివిధ సెక్షన్ల కింద నరేందర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

కేసీఆర్‌ను కలిసిన నరేందర్

ఖిలా వరంగల్: మాజీ సీఎం కేసీఆర్‌ను మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కేసీఆర్‌ను హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

కార్మికురాలిపై కోతుల దాడి

ఖిలా వరంగల్: పారిశుద్ధ్య కార్మికురాలిపై కోతుల గుంపు దాడి చేయగా తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆమెను తోటి పారిశుద్ధ్య కార్మికులు 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన వరంగల్ 34వ డివిజన్ పద్మశాలి కల్యాణ మండపం వీధిలో మంగళవారం జరిగింది. బాధితురాలి కథనం ప్రకారం ఖిలా వరంగల్ తూర్పు కోటకు చెందిన గన్నారపు తేజ.. శివనగర్ పద్మశాలి కల్యాణ మండపం వీధిలో రోడ్డుపై ఊడుస్తున్న క్రమంలో ఆమెపై కోతుల గుంపు దాడి చేసింది. చికిత్స పొందుతున్న తేజను శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, జవాన్లు సుమన్, విష్ణుల, సామాజిక కార్యకర్త అంజయ్య, స్థానిక కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి పరామర్శించారు.

కేయూ రిజిస్ట్రార్‌కు సన్మానం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ రామచంద్రంను రాష్ట్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సోమన్న, కోశాధికారి శశికాంత్, జాయింట్ సెక్రటరీ రమేష్ మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా రామచంద్రంకు బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సరోత్తంరెడ్డిని గెలిపించాలి


ఖిలా వరంగల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బీజేపీ బలపర్చిన అభ్యర్థి పులి సరోత్తంరెడ్డిని ఉపాధ్యాయులు భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ కోరారు. ఈ మేరకు వరంగల్ 34వ డివిజన్ శివనగర్‌లో పార్టీ మండల అధ్యక్షుడు మహమ్మద్ రఫి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఓటర్లను మంగళవారం కలిసి ఓటును అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను కలిసి ప్రచార కరపత్రాలను అందజేసి రవి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేసిన వ్యక్తి సరోత్తంరెడ్డి అని గుర్తుచేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, ఓబీసీ అధ్యక్షుడు బోడకుంట్ల శివశంకర్, పావుశెట్టి స్వరూప, శ్రీనివాస్, శెట్టి రమేష్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఖిలా వరంగల్: ఇటీవల పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వరంగల్ శివనగర్ నవజ్యోతి లైన్‌కు చెందిన వనం భిక్షపతికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు వనం కిరణ్ (36) తన భార్యకు పదేళ్ల క్రితం విడాకులు ఇచ్చాడు. ఈక్రమంలో మద్యానికి బానిసై ఈనెల 16న పురుగుల మందు తాగగా, కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

పెద్ద చెరువు మత్తడికి లీకేజీ

- వృథాగా పోతున్న సాగునీరు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు
- మరమ్మతు చేయాలని వేడుకోలు



లీకేజీ ఏర్పడి వృథాగా పోతున్న సాగునీరు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం నాగారం పెద్ద చెరువు మత్తడి వద్ద లీకేజీ ఏర్పడింది. అది కాస్త పెద్దది కావడంతో సాగునీరు వృథాగా పోతోంది. పదిహేను రోజుల క్రితమే మత్తడి వద్ద ఏర్పడిన చిన్న రంధ్రం క్రమక్రమంగా పెద్ద రంధ్రంగా మారిందని రైతులు తెలిపారు. ఇదిఇలాగే కొనసాగితే పంటపొలాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉన్నాయని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో..

ప్రస్తుతం నాగారం చెరువు పరిధిలో 17గ్రామాలు ఉన్నాయి. సుమారు 3,500 ఎకరాలకు ఈచెరువు ద్వారా సాగునీరు అందుతోంది. భద్రకాళి చెరువు అభివృద్ధి పనుల నేపథ్యంలో ఇటీవల కాల్వల ద్వారా ఆ చెరువు నీటిని నాగారం చెరువుల్లోకి మళ్లించారు. చెరువు మత్తడి కట్ట వద్ద ఏర్పడిన లీకేజీని అరికట్టాలని రైతులు వేడుకుంటున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే నీరు వృథాగా పోతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సరైన సమయంలో అధికారులు గుర్తించినట్లయితే సమస్య అంతటితోనే ఆగిపోయేదని రైతులు అంటున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి తగు చర్యలు చేపట్టకుంటే భారీ నష్టం జరిగే అవకాశం ఉందని పలువురు వాపోతున్నారు.

మరమ్మతులు చేపడుతాం..

మత్తడి వద్ద నుంచి నీరు వృథాగా పోతోంది. తక్షణమే మరమ్మతు చర్యలు చేపడుతాం. నీరు వృథాగా పోకుండా చర్య తీసుకుంటాం. రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదు.

\- శ్రీనివాస్, ఏఈ నీటిపారుదల శాఖ

అంత్యోదయ కార్డులు అందించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వరంగల్: పేదరికంతో దుర్భరమైన జీవితంతో మైదానం ప్రాంతాల్లో నివసిస్తున్న సంచార గిరిజన తెగ కుటుంబాలకు ఆహార భద్రత కోసం అంత్యోదయ కార్డులు ఇచ్చి ఆదుకోవాలని ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ సభ్యుడు, గౌరవ సలహాదారు సోమ సాంబయ్య కోరారు. ఈమేరకు వరంగల్ ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీ సంచార గిరిజనులైన తోటి, కొలామ్స్‌కు ఆహార భద్రత కోసం అంత్యోదయ కార్డులు ఇచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా వరంగల్ జిల్లాలో కొన్ని వందల ఏళ్లుగా వరంగల్ ఆర్డీఓ పరిధిలోని వరంగల్ మండలంలోని లేబర్ కాలనీ, ఖిలా వరంగల్‌లోని చింతల్, గీసుకొండ మండలంలోని బొడ్డు చింతలపల్లి, గరీబ్‌నగర్, అనంతారం, జాన్‌పాక గ్రామాల్లో ఉన్న సంచార గిరిజనులకు కూడా అంత్యోదయ కార్డులు అందించాలని సూచించారు. ఉపాధ్యక్షుడు గుర్రం హరీష్, పరపతి సంఘం కోశాధికారి సోమ నాగరాజు, జిల్లా ప్రచార కార్యదర్శులు సోయం శరత్ బాబు, గుర్రం రాజశేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న మేకల రవి

ఖిలా వరంగల్: ఈనెల 25న నిర్వహించనున్న వందేళ్ల చరిత్ర కలిగిన సీపీఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి మేకల రవి పిలుపునిచ్చారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో వీరగోని శంకరయ్య అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో రవి మాట్లాడారు. జిల్లాలో ఈనెల 25న పల్లెపల్లెన సీపీఐ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అందుకు అన్ని వర్గాల ప్రజలు పూర్తిస్థాయి సహకారం అందించాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాషుమియా, పనాస ప్రసాద్, గన్నారపు రమేష్, దండు లక్ష్మణ్, గుండె బద్రి, సంగి ఎలేందర్, మునీశ్వరుడు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో రామన్ విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

హన్మకొండ: తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్ ఫర్ మ్యాథ్స్ టీచర్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణిత ఒలింపియాడ్‌లో హనుమకొండలోని రామన్ హైస్కూల్ విద్యార్థులు పాల్గొని సత్తా చాటారని స్కూల్ యాజమాన్యం తెలిపింది. రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ స్థాయిలో మిథాంష్ రెడ్డి 3వ ర్యాంకు, జూనియర్ కేటగిరిలో అవినాశ్ రెడ్డి స్టేట్ 1వ ర్యాంకు, శ్రీహర్షిక 2, యశస్విని 3, ధార్మిక్ 4, యుక్త శ్రీ 5, హర్షిత్ 5, హర్షద్ తేజ 5, అనీష్ చంద్ర 5, ఆశ్రిత 5, సహజ 5, ఖుదిసియా జీనత్ 6, సాయి కౌశిక్ రెడ్డి 6, లక్ష్యసాయి 6, హర్షవర్ధన్ మల్లిక్ 7, మణిదీప్ 8, దీపాన్విత 10, సహస్ర 10, శ్రీమాన్ 10వ స్టేట్ ర్యాంకు సాధించారని వివరించింది. సీనియర్ కేటగిరిలో మోహిత్ రెడ్డి, రమణీత్ రెడ్డి స్టేట్ 2, అక్షిత 4, సూర్యవైష్ణవి 4వ ర్యాంకు సాధించారని తెలిపింది. ఈమేరకు సుబేదారిలోని రామన్ హైస్కూల్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆ విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ రాజేష్, డైరెక్టర్ పురుషోత్తం, మడికొండ ప్రిన్సిపాల్ స్రవంతి, సుబేదారి ప్రిన్సిపాల్ రజిత అభినందించారు.

22నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ బాధ్యులు

వరంగల్: వరంగల్ కాశిబుగ్గ కాశీ విశ్వేశ్వరాలయంలో ఈనెల 22నుంచి 26వ తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వడిచెర్ల సదానందం, డాక్టర్ గోనె జగదీశ్వర్లు తెలిపారు. ఈమేరకు ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆలయ ప్రాంగణంలో మంగళవారం విడుదల చేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు, 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, మాజీ కార్పొరేటర్ బయ్యా స్వామి, గుండేటి కృష్ణమూర్తి, దూపం సంపత్, సముద్రాల పరమేశ్వర్, ఓరుగంటి కొమురయ్య, వైకుంఠం, శ్రీరాములు, బి.భాస్కర్, రాజు, అర్చకులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

కాజీపేట రూరల్: రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని యూనియన్ నాయకులు కోరారు. ఈమేరకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌కు మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ జోనల్, డివిజన్, కాజీపేట నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సికింద్రాబాద్‌లో చేపట్టిన సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ రైల్వే ఉద్యోగుల నిరసన దీక్షకు కాజీపేట నుంచి పలువురు నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ జోనల్, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు కె.శ్రీనివాస్, సీహెచ్.శంకర్‌రావు, ఖాజాబాబా, పి.రవీందర్, కాజీపేట నుంచి మజ్దూర్ యూనియన్ అన్ని బ్రాంచీల సెక్రటరీలు ఎస్.సదానందం, సమ్మయ్య, పి.వేదప్రకాష్, బాలముని రాజు, రాజేందర్, చైర్మన్లు ఎస్‌కే.జాని, శ్రీనివాస్‌యాదవ్, రాజు, ట్రెజరర్ గిరిమిట్ల రాజేశ్వర్‌రావు, యాదగిరి, రాజయ్య, యాదగిరి, ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన 'మార్నేని'

హన్మకొండ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు మర్యాదపూర్వంగా కలిశారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పదవీ కాలపరిమితి మరో ఆరు నెలలపాటు పెంచిన సందర్భంగా హైదరాబాద్ సీఎంతోపాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ మంత్రి జానారెడ్డిని మార్నేని మంగళవారం కలిసి సన్మానించారు.

ఇద్దరు ప్రొఫెసర్లకు అభినందనలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన హిస్టరీ విభాగం ప్రొఫెసర్ మనోహర్, సీడీసీడీన్‌గా బాధ్యతలు స్వీకరించిన కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రొఫెసర్ వరలక్ష్మిని తెలంగాణ గ్రాడ్యుయేట్స్ ఫోరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మేడారపు సుధాకర్, తాళ్లపెల్లి నరేష్, బాధ్యులు మంగళవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫోరం బాధ్యులు సూరాసి కృష్ణ, జెట్టి రాజేందర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

యువకుడి ఆత్మహత్యాయత్నం

వరంగల్: వరంగల్ కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన ఓ యువకుడు అప్పులు తీర్చలేక మంగళవారం సాయంత్రం ఆత్మహత్యాయత్నానికి యత్నించినట్లు తెలిసింది. అతడి తండ్రి అప్పులు చేసి తీర్చలేక ఇంట్లో నుంచి వెళ్లిపోగా, అప్పులు ఇచ్చినవారు యువకుడిపై ఒత్తిడి తీసుకురావడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. ఈక్రమంలో ఆత్మహత్య చేసుకుంటున్నానని తన స్నేహితులకు వాట్సాప్‌లో వీడియో పంపడంతో, ప్రాణాపాయ స్థితిలో ఉన్న యువకుడిని అతడి స్నేహితులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది.

కారు – టిప్పర్ ఢీ.. ముగ్గురికి గాయాలు

ఖిలా వరంగల్: కారును టిప్పర్ వెనుక నుంచి ఢీకొట్టగా, కారు అదుపు తప్పి డివైడర్ ఢీకొట్టి నిల్చింది. కారు నుజ్జునుజ్జు కాగా కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటన వరంగల్ – నర్సంపేట రహదారిపై మిల్స్‌కాలనీలో మంగళవారం మధ్యాహ్నం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం నర్సంపేటకు చెందిన కూచన రవి, కూచన శంకరయ్య, డ్రైవర్ తాళ్ల త్రినేష్ కారులో వరంగల్‌కు బయల్దేరారు. ఈక్రమంలో మిల్స్‌కాలనీలో కారును టిప్పర్ ఓవర్‌టేక్ చేస్తున్న క్రమంలో ఢీకొట్టింది. కూచన రవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి..

ఖిలా వరంగల్: వరంగల్ ఓసిటీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయాలయ్యాయి. స్థానికుల తెలిపిన కథనం ప్రకారం ఓసిటీకి చెందిన ప్రభాకర్.. పండ్లు కొనేందుకు స్కూటీపై ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలోని నర్సంపేట రోడ్డుకు వెళ్లాడు. వాహనం పార్క్ చేసి పండ్లు కొనుగోలు చేస్తుండగా ఒకే వాహనంపై ఇద్దరు యువకులు స్నేక్ డ్రైవ్ చేస్తూ స్కూటీని బలంగా ఢీకొట్టడంతో ప్రభాకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి స్థానికులు తరలించారు.

భారీగా గుట్కా ప్యాకెట్ల స్వాధీనం

రామన్నపేట: మట్టెవాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని పిన్నావారి వీధిలో మహేందర్ కుమార్, జేపీఎన్ రోడ్డులోని కాలురామ్ వ్యాపారుల గోడౌన్లలో నిషేధిత గుట్కా ప్యాకెట్ల అక్రమంగా నిల్వ ఉంచినట్లు అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. ఈ మేరకు రూ.2,31,500 విలువగల గుట్కా ప్యాకెట్లు, బజాజ్ ఆటోను స్వాధీనం చేసుకొని, వ్యాపారులపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. దాడిలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

నిద్రమత్తులో డివైడర్‌ను ఢీకొట్టిన లారీ డ్రైవర్

ఖిలా వరంగల్: డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో లారీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో స్వల్ప గాయాలతో డ్రైవర్, క్లీనర్ క్షేమంగా బయటపడ్డారు. ఈ సంఘటన మంగళవారం తెల్లవారుజామున వరంగల్ ఆర్టీఏ జంక్షన్‌లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం ఖమ్మం నుంచి కరీంనగర్ వైపు లోడుతో బయల్దేరిన లారీ.. మంగళవారం తెల్లవారుజామున 4గంటలకు ఆర్టీఏ జంక్షన్ దాటిన వెంటనే నిద్రలోకి డ్రైవర్ జారుకోవడంతో లారీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది.

దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు

ఖిలా వరంగల్: ఓ వ్యక్తిపై దాడిచేసిన మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు. హనుమకొండ దర్గా కాజీపేట సిద్ధార్థనగర్‌కు చెందిన కొమ్ము మల్లేశ్వర్ అతని కుమారుడు కొమ్ము బాలసాగర్ కలిసి ఈనెల 13న తూర్పుకోటలో జరిగిన దశదిన కర్మకు హాజరయ్యారు. సమీప బంధువులైన బాలసాగర్, గీకుడు రవి ఇరువురు గొడవ జరిగి పరస్పరం దాడి చేసుకున్నారు. బాలసాగర్‌కు గాయాలుకాగా, మల్లేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

అదుపు తప్పితే ఆస్పత్రికే..



హసన్‌పర్తి: ఆరెపల్లి - మల్లారెడ్డిపల్లి ప్రధాన రహదారిలో సిద్దాపురం సెంటర్‌లో రోడ్డు కింద పైపులైన్ ఏర్పాటు చేశారు. రోడ్డుకు సైడ్ బర్మ్ లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అనేకమంది వాహనదారులు అదుపుతప్పి కిందపడి ఆస్పత్రి పాలైన ఘటనలు అనేకం ఉన్నాయి. ఈ విషయాన్ని ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు.

ఆలయాల హుండీ ఆదాయం లెక్కింపు



మడికొండ: కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది



వరంగల్ చౌరస్తా: హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

మడికొండ: మడికొండలోని మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయంలోని హుండీలను దేవాదాయ శాఖ అనిల్‌కుమార్ పర్యవేక్షణలో మంగళవారం లెక్కించారు. 11నెలల అనంతరం శివాలయంలోని 10 హుండీలను లెక్కించగా రూ.2,72,547, రామాలయంలోని హుండీల నుంచి రూ.72,537 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కే.శేషభారతి వివరించారు. అలాగే, వేలం నిర్వహించగా లడ్డూ, పులిహోరకు రూ.లక్షా 52 వేలు, కొబ్బరి చిప్పల సేకరణతో రూ.27,500, అభిషేక పంచామృతాల విక్రయాలకు రూ.45 వేలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ, ధర్మకర్తలు భైరి రాజు, రొడ్డ దయాకర్, వస్కుల ఉమ, దండిగం శ్రీనివాస్, బోగి కేదారి, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయ ఆదాయం రూ.6,88,114

వరంగల్ చౌరస్తా: రామన్నపేట బట్టలబజారులోని బాలానగర వేంకటేశ్వర స్వామి దేవాలయంలోని హుండీని మంగళవారం లెక్కించారు. ఇటీవల జరిగిన బ్రహ్మోత్సవాల్లో రూ.6,88,114 నగదు వచ్చిందని ఆలయ ఈఓ ఏలపాటి రత్నాకర్ రెడ్డి, చైర్మన్ పరాశరం శ్రీనివాసాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ అరుణ, పోలీసులు, మాజీ ధర్మకర్తలు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ విజయవంతానికి కృషి



మాట్లాడుతున్న జగన్మోహన్‌రావు

- టీజీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్మోహన్‌రావు

హన్మకొండ అర్బన్: వరంగల్, హనుమకొండ జిల్లాల గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ తరఫున మార్చి 8న నిర్వహించనున్న మహిళా దినోత్సవ నిర్వహణను జిల్లా గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ పక్షాన పూర్తి సహాయ సహకారాలు అందించి విజయవంతం చేసేందుకు కృషి చేస్తామని టీజీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్నమనేని జగన్మోహన్‌రావు తెలిపారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని టీజీఓ భవన్‌లో అసోసియేషన్ జిల్లా సహాధ్యక్షులు అనురాధ, నీరజ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాల నిర్వహణ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనురాధ, నీరజ మాట్లాడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీజీఓ వరంగల్ జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, గెజిటెడ్ అధికారులు కిరణ్మయి, అరుణ, ప్రేమలత, ఫణికుమార్, ప్రవీణ్, రాజేష్, రాజేష్‌రెడ్డి, మాధవి, పవిత్ర, భాగలక్ష్మి, శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ అభ్యర్థుల నియామకంలో అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న రామన్న నాయక్

నయీంనగర్: 2008 డీఎస్సీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఏజెన్సీ అభ్యర్థుల కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల నియామకంలో అన్యాయం జరిగిందని, అవకతవకలకు పాల్పడిన డీఈఓ వాసంతిపై చర్యలు తీసుకోవాలని నవ తెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ రామన్న నాయక్, ఏజెన్సీ ప్రాంత నిరుద్యోగ అభ్యర్థులు డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రామన్న మాట్లాడుతూ హనుమకొండ డీఈఓ కార్యాలయంలో జరిగిన తప్పిదం వల్ల తాము ఉద్యోగాలు కోల్పోయి నిరుద్యోగులుగా మిగిలిపోయామని ఆందోళన వ్యక్తం చేశారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరిగినా సెలెక్షన్ లిస్టులో తమ పేర్లు రాలేదని వాపోయారు. ప్రభుత్వం పునఃపరిశీలన చేసి ఉద్యోగాలు కల్పించి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో ఇస్లావత్ వెంకన్న, జాటోత్ సోమ్లా, ఇస్లావత్ రాములు, గుగులోతు సంజీవ్‌కుమార్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సు వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ప్రొఫెసర్లు

హన్మకొండ అర్బన్: నగరంలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మార్చి 26, 27వ తేదీల్లో కళాశాల భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'ఇంటర్ డిసిప్లినరీ మెటీరియల్ సైన్స్ ఫర్ సస్టైనబుల్ ఎనర్జీ అండ్ ఎన్విరాల్‌మెంట్' అనే అంశంపై నిర్వహించనున్న జాతీయ సదస్సు వాల్‌పోస్టర్లను కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి, సదస్సు కన్వీనర్ పి.అరుణ, భౌతికశాస్త్ర విభాగాధిపతి కవిత, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ సురేష్‌బాబు, అధ్యాపకులు కొలిపాక శ్రీనివాస్, జ్యోతి, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యపరీక్షలు చేయించుకోవాలి



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఎంజీఎం: ఆరోగ్య స్థితిగతులపై ప్రతిఒక్కరూ ఆరు నెలలకోసారి వైద్యపరీక్షలు చేయించాలని టీబీ హాస్పిటల్ వైద్యాధికారి శ్రీనివాస్ సూచించారు. నగరంలోని వాజ్‌పేయికాలనీలో సురక్ష కేంద్రం మేనేజర్ ఇక్బాల్‌పాషా అధ్యక్షతన సురక్ష కేంద్రం, టీబీ హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. వైద్యులు పలువురికి పరీక్షలు చేశారు. అనంతరం జిల్లా ప్రోగ్రాం మేనేజర్ స్వప్నమాధురి మాట్లాడుతూ మానసిక ఆరోగ్యపరమైన కౌన్సెలింగ్, సుఖలైంగిక వ్యాధులపై అవగాహన, చికిత్సకు సంపూర్ణ సురక్ష కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. అనంతరం సంపూర్ణ సురక్ష కేంద్రం కరపత్రాలను ఆవిష్కరించారు. వైద్యాధికారి హైదర్, ఐసీటీసీ కౌన్సిలర్ సురేశ్, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్, టీబీ సెంటర్ కోఆర్డినేటర్లు బాబు, శ్రీనివాస్, ఆర్‌డీఎంఎం సిబ్బంది సుధాకర్, కిరణ్, నాగేశ్, ఈశ్వర్, వరంగల్ సంపూర్ణ సురక్ష కేంద్రం ఓఆర్‌డబ్ల్యూఎస్ సరిత, రాజేంద్రప్రసాద్, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కేసీఆర్ క్రికెట్ చాంపియన్‌షిప్ విజేతకు కప్ అందజేత



విజేత జట్టుకు కప్ అందిస్తున్న కేటీఆర్

హన్మకొండ: మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకుని హనుమకొండలో నిర్వహించిన క్రికెట్ చాంపియన్‌షిప్ విజేత జట్టుకు హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో కప్, బహుమతులను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అందించారు. ఈ సందర్భంగా పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్‌ను అభినందించారు. ఆర్గనైజర్, కాకతీయ క్రికెట్ అకాడమీ ఫౌండర్ ఫారుక్, సభ్యులు మాజిద్, అస్లాం, షాకీర్, వీరు, సిరాజ్, రాజేష్ కుమార్, మాజిద్, రాంబాబు, ఫర్దిన్, నాయకులు రజినీకాంత్, రమేష్, రామ్మూర్తి పాల్గొన్నారు.